# నమ్మిన నాగలి

—గోడా నాగేశ్వరరావు

నాగలి భుజానవేసుకుని దూకుడుగా నడిచిపోతున్నాడు నరసయ్య. కొరుక్కుతినే చలి. కన్నుకన్ను కానని పొగమంచు. రైతుల రక్తాన్ని చిందించే సమయం. కర్షకులు ఎండనక, రేయనక పగలనక కష్టించేకాలం. రెండవపంట పనుల్లో రైతుకుటుంబాలన్నీ నిమగ్నాలయ్యాయి. వారి రక్తనాడులు కదనము చేయనిదే కొన్ని కోట్ల కంఠాలకు కదలికుండదు.

సంక్రాంతినెల అంటా సందడిగాఉంది. గ్రామసీమలు సరిక్రొత్తపంటలతో కళకళలాడుతున్నాయి. అలవాటుప్రకారం నరసయ్య కాళ్ళు ముందుకు సాగుతున్నవి. ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని చూచిగాని గుర్తురాలేదు నరసయ్యకు, తను ఎడ్లను తోలుకురాకుండా వట్టి నాగలితో వస్తున్నాడు పొలం, తన మందమతిని మనస్సులోనే నిందించుకున్నాడు. ఈ బ్రతుకుకు భవిష్యత్తుందా అనుకున్నాడు. గత చరిత్ర క్షణకాలం కళ్ళల్లో కదిలింది.......

......నరసయ్య సామాన్య రైతుకుటుంబంలో పుట్టాడు. తన తల్లిదండ్రుల కొక్కడే పుత్రుడు కావడంతో అతిగారాబంగా పెరిగాడు. బడి ఈడు వచ్చింది నరసయ్యకు. మంచిరోజు చూడమని పంతులుగారికి మనవిచేసుకున్నాడు నరసయ్య తండ్రి. తమ కుటుంబంలో అనాదిగా వ్యవసాయ వృత్తిని మాని తన కొడుకు బడికివెళ్ళటం నరసయ్య తల్లిససేమిరా కుదరదన్నది. చదువుకున్నంతమాత్రాన వ్యవసాయం విడనాడవలసియుండదని నచ్చచెప్పారు పంతులుగారు. పిల్లవాడి నక్షత్రబలం గొప్పదన్నారు అప్పుడే అలా దారినపోతున్న కొండదొర. పంతులుగారికి పట్టువస్త్రాలు పిల్లలకు పప్పుబెల్లాలతో ప్రారంభమయింది నరసయ్య విద్యాభ్యాసం, పొలంపనుల్లో ప్రావీణ్యం పల్లె చదువుపూర్తిచేయడం ఒకేసారి జరిగాయి.

పంతులుగారి పట్టువల్ల బస్తీ భవనాలు చూడవలసి వచ్చింది నరసయ్యకు. నరసయ్య నారాయణరావుగా ఉన్నతవిద్య ప్రారంభించాడు కాలచక్ర మొకమెట్టు ముందుకురికింది. ఇప్పుడు నరసయ్య — కాదు - నారాయణరావు పట్టభద్రుడు. పైగా తాలూకాఫీసులో దిగువతరగతి గుమాస్తాగిరి. నారాయణరావుకు అతి మాసం మెండు. 'నారాయణరావు గుమాస్తాగారు నిజాయితీకి గీటురాయి' అన్నారు. ఈ రోజుల్లో నిజాయితీ ఉద్యోగస్తులెవర'న్నారు కొందరు. తనకొడుకు తనకీ తన ఊరికీ పేరుతెచ్చాడని మురిసిపోయాడు నరసయ్యతండ్రి, నరసయ్య తండ్రితో వియ్యమందటానికి ముగ్గురు నలుగురు చిన్నతరహా భూస్వాములు ముందుకువచ్చారు. నరసయ్య తల్లి దండ్రుల సంతోషాని కంతులేదు. తమ జీవితం ధన్యమైన దనుకున్నారు.

నారాయణరావు ఎగువతరగతి గుమాస్తాగా జిల్లా కార్యాలయానికి బదిలీఅయ్యాడు. తన శక్తికొలదీ పనిచేసిఅధికారుల దయకు పాత్రుడయ్యాడు. తన ఊరివారంతా సంబరపడ్డారు. తల్లిదండ్రులను తన దగ్గర ఉంచుకోవాలనుకున్నాడు. కాని వారికి పట్టణ వాతావరణం పడక పల్లెలోనే ఉంటామన్నారు. తాము జీవితంలో పొలాల్ని పశువుల్నీ విడువలేమన్నారు. తమ జీవితమంతా ఇలాగే గడచిపోవాలన్నారు. నారాయణరావు శలవుమీద అప్పుడప్పుడు ఊరికిపోయి తల్లిదండ్రులను చూచివస్తుండేవాడు. ఊరిలో రెండు మూడు రోజులకంటె ఎక్కువ ఉండటానికి వీలయ్యేదికాదు. తను ఊరినుండి బయలుదేరేటప్పుడు కొంతమంది గ్రామస్తులెదురై "అబ్బాయిగారెప్పుడొచ్చారు." అని అడగటం అతని కలవాటైపోయింది అప్పుడే రావటమూ వెళ్ళటమూనా? ఎందుకొచ్చిన చదువు? పుట్టినఊరు వదలి పరాయిచోట పడుండాలి" అనే వారు కొందరు "నాన్న అమ్మ ముసలి వాళయారు పదిరోజులపాటుండిపోకూడదు?'' అనేవారు బాగా పరిచయమున్న పెద్దవారు. ఉద్యోగంలో ఉన్న యిబ్బందులేమి తెలుస్తవి ఆ పల్లె ప్రజలకు తనకు మాత్రం తనవాళ్ళని తన గ్రామాన్ని వదలివెళ్ళాలని ఉంటుందా? నిజానికి పల్లె ప్రజలలో ఉన్న మన్నన ఆప్యాయత పట్టణవాసులలో ఉండవు కాని ఏమి చేస్తాడు? తప్పదు. అవతల ఉద్యోగం. చదువు

ఉన్నారుకాబట్టి ఉద్యోగము వెలగబెట్టాలి. ఒక్కొక్కసారి ఎందుకుచదువుకున్నానని మధనపడేవాడు. చదువుకోకపోతే చీకుచింతా లేకుండా హాయిగా ఆలోచనలు లేకుండా పల్లెలోనే ఉండేవాడిననుకొనేవాడు. నారాయణరావుకు హోదాతోబాటు ఆఫీసులో పనికూడ పెరిగింది, తనకు అన్యాయమని తోచినా పై అధికారి ఆజ్ఞప్రకారము ఆర్డరులు జారీచేయవలసివస్తుంది. దాన్ని ఆతడు సహించలేకపోతున్నాడు. కాని అది ఉద్యోగ ధర్మము. తనకు ఇష్టమున్నా లేకపోయినా అధికారుల ఆజ్ఞ శిరసావహించవలసినదే. అది క్రమశిక్షణ అధికారులనుండి శ్రీముఖం రాకుండుటకై ఆఫీసునే ఆలయముగా మార్చుకున్నాడు నారాయణరావు.

ఆరోజు ఆదివారము. ఆలయములో ఆసీనుడైయున్నాడు నారాయణరావు. 'ఎక్స్‌ప్రెస్' లెటరు అంటూ వచ్చాడు తపాలా బంట్రోతు. సంతకముచేసి ఉత్తరము అందుకుని చించాడు నారాయణరావు. ఆవ్రాత తనకు పరిచయమైనదే. పంతులుగారువ్రాసారు సముద్రపు పోటువచ్చి ఊరు మునిగినదని పంటలన్నీ పూర్తిగా పాడయ్యాయని. ఉప్పునీరు మూడు రోజులు నిలువయుండుటచే అంటువ్యాధులు అలముకున్నవని. తన తల్లి దండ్రులు అనారోగ్యము పాలయ్యారని వెంటనే రావలసినదిగా వ్రాశారు. ఒక్కసారి కాతని తలిదండ్రులు, పొలాలుగుర్తు కొచ్చాయి. వెంటనే పైకెగిరి తన గ్రామములో వ్రాలాలనుకున్నాడు. తనిప్పుడు రెక్కలు కట్టబడిన పక్షి. అధికారుల ఆజ్ఞలేనిదే ఉన్న ఊరు విడిచిపోవుటకు స్వేచ్ఛలేని విధి బంధితుడు కాగితముపై ఏదో వ్రాసి తన ఆఫీసరు యింటికి పరుగుతీశాడు నారాయణరావు. నేంబోర్డుపై "ఔట్"ను చూచి విస్తుపోయాడు. ఆపదలో ఉన్న తనవారిని తన గ్రామాన్ని ఆదుకోలేని తన బ్రతుకెందు కనుకున్నాడు కాబోలు కాగితము తోటి దిగువతరగతి గుమాస్తాకిచ్చి బయలుదేరాడు నారాయణరావు.

తన ఊరు చేరుకునేటప్పటికి చీకటి పడింది. ఏదో క్రొత్త ప్రాంతములో ఉన్నట్లు తోచింది నారాయణరావుకు. ఎంతగా మారిపోయింది. దిబ్బలు కాశీగా ఉన్నాయి. వాటిమీదఉన్న గడ్డివాములు సముద్రుని చేరిఉంటవి. చిన్నగా చినుకులు పడుతున్నాయి తలదాచుకొనుటకు పశువులశాలకు పరుగుతీశాడు. కాని దానిపైకప్పులేదు. వట్టి గుంజలు మాత్రము మిగిలాయి. తన ఊరుకు పట్టిన దుర్గతికి చింతించాడు. ప్రతి అయిదు సంవత్సరాలకు సాధారణ ఎన్నికలు వచ్చే మాదిరిగా తన గ్రామానికి అప్పుడప్పుడు ఈ ఉప్పెనలు రావడంకూడా పరిపాటయింది. తన గ్రామాన్ని దేశానికి అన్నపూర్ణ అంటారు. ఆ అన్నపూర్ణను ఆపదలో ఆదుకునే ఆసాములులేరు. ఈ విపత్తునుండి శాశ్వతముగా తన గ్రామాన్ని రక్షించుకోవాలనుకున్నాడు నారాయణరావు. రైతులందరిని సమావేశపరచి మొగదగ్గర ఏటిగట్టు నిర్మించవలసినదిగా ప్రభుత్వానికి దరఖాస్తు దాఖలు చేశారు. నాలుగు పక్షములు గడచినా సమాధానం రాలేదు. రైతులందరు నారాయణరావు నాయకత్వము క్రింద ప్రభుత్వమునకు స్వయముగా విన్నవించుకున్నారు.

ఈలోపుగా తన ఆఫీసునుండి కాగితము వచ్చినది. తన శలవు మంజూరు కాలేదని. అధికారుల ఆజ్ఞ లేకుండా ఆఫీసువదలి వెళ్ళినందుకు తన మీద క్రమ శిక్షణ చర్య ఎందుకు తీసుకోకూడదో సంజాయిషీ చెప్పుకోమన్నారు. సంజాయిషీకి బదులు రాజీనామాను పంపాడు నారాయణరావు.

రైతులందరినీ పిలిచి రైతు సంఘం స్థాపించాడు నారాయణరావు. తలిదండ్రులు వృద్ధులు. పొలముపని కూడ తనే చూచుకోవలసి వస్తుంది. ఉన్నట్టుండి పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ఆ వూరికి పంచాయతీ వచ్చినది మొదలు పెదరాజుగారే పోటీలేకుండా ప్రసిడెంటవుతున్నారు.

ఈ దఫా నారాయణరావుని ప్రెసిడెంటు చేయాలన్నారు కొంతమంది యువతరం రైతులు. ఎలక్షను ఆఫీసరు నారాయణరావుకు ఓటుచేసే వారిని చేతులు పైకెత్తమన్నారు. పెదరాజుగారి కోరమీనము పె

కెగిరింది, పేదరైతుల చేతులు క్రిందికి కుంచుకు పోయాయి.

కాలచక్రం తన గమ్యస్థానము చేరుకోటానికి ఉరకలువేస్తుంది. పురిటిలోనే సంధికొట్టినట్లు పంచాయతీ ఎన్నికలలోనె పరాజయం. మంచాన పడిన ముసలి తలిదండ్రులు. దున్నేవాడిదే భూమి అనే పద్ధతి త్వరలో వస్తుందని పత్రికలు ప్రకటించాయి. నారాయణరావు సంబరపడ్డాడు. కొద్దిరోజులలోనె తన సంబరం తలక్రిందులైంది. తన తాతల నాటి నుండి వస్తున్న కమతము కాస్త ఊడింది. తనిపుడు అటు ఉద్యోగికాడు ఇటు రైతుకాదు. కేవలం కర్షకుడు. రెక్కాడితే డొక్కాడుతుంది. కౌలు పొలాలు పోయినా పశువులు మిగిలాయి. తన ఎడ్లతో కూలికి అరకలుకట్టి కుటుంబం పోషించుకుంటున్నాడు.

గత స్మృతుల నుంచి బయట పడ్డాడు. ఎడ్లు తోలుకొని పొలానికి వెళ్ళాడు. అతనిలో ఎంతోశక్తి వచ్చినట్లయింది. నాగలిభుజంమీద ఎంతో తేలికగా అనిపించింది. ఉద్యోగంపోయిన బాధా, పొలంపోయిన బాధా అతనికి అల్పంగా తోచాయి. నాగలి తన్ను నమ్ముకుంది. నాగలిని తను నమ్ముకుంటాడు. తన చదువు సంస్కారం నాగలికి జోడించి తనొక కృషివలుడిగానె జీవించాలి, అనుకుంటూ ధైర్యంగా ఆ చలిని చీల్చుకుంటూ ముందడుగు వేశాడు నరసయ్య.

# విత్ బెస్ట్ రిగార్డ్స్

పి.గోపాల కృష్ణరావు.

ఇంకా ఏం కోరను ప్రభూ
కృతజ్ఞుడ నయి
వినమ్రుడ నయి
పదే పదే నమస్కరించడం తప్ప
ఇంకా ఏంచేయను ప్రభూ...
అర్థాన్ని కాక పోయినా అర్థం చేసుకునే అర్ధాంగి నిచ్చావు
వెన్నెల సుధల్లాంటి పాలనవ్వుల పాపనిచ్చావు
సంపత్తి కాకపోయినా సంతృప్తి నిచ్చావు
ఆశల అశ్వారోహణం చేసి
ఆరోరాపైపు పయనించాలని లేదునాకు
అవకాశాల వృత్తిపరిధిలోనే
ఆశయాల గులాబీలు పూయిస్తాను. పరవాలేదు .
చీకటి నిచ్చినా వెలుగు నిచ్చావు
వేడిమి నిచ్చినా వెన్నెల నిచ్చావు
నిండు మనసు నిచ్చావు మమత నింపావు
మెండు స్నేహాన్నిచ్చావు మాధురినింపావు
తృప్తిగొన్న మనస్సు కివేపదివేలు...
నమనస్సులు నీకివే వేనవేలు